

# శ్రేయోభిలాషులు

- మొక్కపాటి శ్యామల

లతా! నా సాక్స్ కనిపించట్లేదు కొంచెం చూసి పెడతావా? అలవాటుగా పిలిచాడు శేఖర్.

మీ అలమరలోనే ఉంటాయి చూసుకోండి. నిన్నంతా ఇంట్లో ఖాళీగానే ఉన్నారు కదా! ఏం చేశారు? ఐనా మీకిప్పుడు అర్జంటేముంది, పిల్లలకి, నాకు టైమైపోతోంది. మీకు దోసెలు వెయ్యటానికి కూడా నాకు టైము లేదు. మేము వెళ్ళాక మీ పనులన్నీ చూసుకుని నెమ్మదిగా వెళ్ళండి అంటూ కారు తాళాలు తీసుకుని, పిల్లల్ని వెంట పెట్టుకుని హడావిడిగా వెళ్ళిపోయింది లత.

తను ఆరోజు కలుసుకోవాల్సిన వ్యక్తి గురించి ఆలోచిస్తూ, అలవాటుగా లతని పిలిచిన శేఖర్‌కి, లత సమాధానం ఛెళ్ళున కొట్టినట్టయి ఈ లోకంలోకి వచ్చాడు.

అన్నట్టు ఇప్పుడు లత ఉద్యోగం చేస్తోంది కదా అనుకున్నాడు. ఆలోచనల లోంచి బయటపడగానే, వర్తమానం భయపెట్టింది.

ఆర్థిక మాంద్యానికి తన ఐ.టి ఉద్యోగం బలైపోగా, ఈ రెండు నెలల్లో తన జీవితం సునామీ తరువాత సముద్ర తీరంలా రకరకాల మార్పులు చెందింది. ఒకప్పుడు తనను ఎంతో గౌరవంగా, ఆరాధనగా చూసినవాళ్ళంతా ఇప్పుడు తనని చూసి హేళన చేస్తున్నట్టు, మంచి పనయిందిలే, పెరుగుట విరుగుట కొరకే అని తనని చూసి నవ్వుకుంటున్నట్లు అనిపిస్తోంది. అప్పుడప్పుడు, నేనే అనవసరంగా ఫీలవుతున్నానేమో, నా మనసులో ఉన్న భయమే అలా అనిపిస్తోందేమో, అనే ఆలోచన కూడా వచ్చేది కానీ, లత ప్రవర్తన చూస్తుంటే మాత్రం, ఆ చిన్ని ఆశ కూడా తుడిచిపెట్టుకుపోతోంది.

ఇన్నాళ్ళూ, తనకు గ్యాస్‌ప్రోబ్లమ్‌వలన టైముకి తినకపోతే, కడుపులో మంట వస్తుందని, మిగిలిన పనులన్నీ వాయిదావేసి 8.30కల్లా టిఫెన్ తయారుచేసి, ఒక్కొక్కసారి తనకు టైములేదన్నా వినకుండా, బలవంతాన తినిపించే లత, ఇవ్వాళ్ళ ఇలా మాట్లాడుతుంటే, కలా! నిజమా? అనిపిస్తోంది. అనుకుంటూ, కొత్తగా వచ్చిన మార్పులకి అలవాటుపడలేక, అలవాటు పడక తప్పక సతమతమవుతున్న శేఖర్.

గడియారం ఠంగ్! ఠంగ్‌మని తొమ్మిది గంటలు కొట్టగానే, అమ్మో! అప్పుడే తొమ్మిదయింది. ఇంకా స్నానం టిఫెన్, డ్రస్సింగ్ చాలా పనులున్నాయి. పైగా నేనే చేసుకోవాలి అనుకుంటూ పైకి లేచాడు శేఖర్.

రెండుసార్లు చేతులు కాల్చుకుని, రెండు మాడిపోయిన దోసెలు వేసుకుని తిని, సాక్స్‌కోసం వెతికి వెతికి, చివరికి అవి కనపడక, మాసి కంపుకొడుతున్నాయని ఒదిలేసిన సాక్సే మళ్ళీ వేసుకున్నాడు. చెయ్యి మంట పెడుతుంటే చూసుకుని ఆశ్చర్యపోయాడు. ఇందాక కాలినచోట ఎర్రగా బొబ్బలెక్కింది. అమ్మకూడా ఉద్యోగం చేసేదికానీ, తనకి టిఫెను రెడీ చెయ్యకుండా ఒక్కరోజు కూడా వెళ్ళేది కాదు. ఒకవేళ ఎప్పుడైనా చేయలేకపోతే తెప్పించి రెడీగా ఉంచేది. అందుకే తనకి ఇలాంటి చిన్న చిన్న పనులు కూడా అలవాటు అవలేదు. ఇవ్వాళ్ళ టిఫెన్‌కోసం చేతులు కాల్చుకుంటే, అమ్మ గుర్తొచ్చింది. అమ్మ! తనకోసం ఎంత ఆరాటపడేది? పరీక్షలలో తను చదువుకుంటుంటే, గంట గంటకి హార్లిక్స్, పాలో ఏవో ఒకటి ఇచ్చేది. తను మేలుకుని ఉన్నంత సేపూ అమ్మకూడా మెలుకువగానే ఉండేది. ఎప్పుడు పడుకునేదో, ఎప్పుడు లేచేదో, తను లేచేసరికి తనకి అన్నీ రెడీ చేసి ఉంచేది. అలాంటి అమ్మకి తనేం చేయగలిగాడు?

ఇంకా సర్వీసు ఉందని, తనకి బెంగుళూరులో ఉద్యోగం వచ్చినా, అమ్మ వైజాగ్‌లోనే ఉండిపోయింది. తను రెండుమూడేళ్ళు మించి ఏ కంపెనీలోనూ చేసే వాడు కాదు. అందుకే ఎప్పుడూ కొత్త కంపెనీ, కొత్త ఉద్యోగం బిజీగా ఉండేవాడు. అమ్మే అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్ళేది తప్ప, తను వెళ్ళేవాడు కాదు. చివరికి అమ్మ హార్ట్‌ఎటాక్‌తో పోయాక వెళ్ళాడు తను. అదీ వెంటనే వెళ్ళలేక రెండు రోజుల తర్వాత వెళ్ళాడు. ఎంత కృతఘ్నుడు తను? అందుకేనేమో, దేవుడు ఇలా శిక్షించి, ఆలోచించేలా చేశాడేమో? అమ్మ-గతం గుర్తురాగానే, తెలియకుండానే, రెండు కన్నీళ్ళ చుక్కలు టప్‌మని చేతులు మీద రాలాయి!

ఛ! నేను ఎందుకింత బేలగా అయిపోతున్నాను. ఉద్యోగం పోయేసరికి, నాకు తెలివి, ఆలోచన అన్నీ పోయినట్టుగా ఉన్నాయి. ఉద్యోగం పోయినంత మాత్రాన నేను మరీ వీధిన పడాల్సిన స్థితిలో లేను కదా! ఎక్కువ కాలం ఇలా ఉంటే, ఆ పరిస్థితి వచ్చేస్తుందనే భయమే నన్నిలా వెంటాడుతోందేమో! లాభం లేదు.

ఇవ్వాళ్ళ రోజంతా తిరిగైనా సరే, ఇదివరకటిలాగా, హైలెవెల్లో లేకపోయినా, ఏదోఒకటి చిన్న ఉద్యోగమైనా సంపాదించాలి. అన్నట్టు ఇవ్వాళ్ళ గుడికి కూడా వెళ్ళాలనుకున్నాను కదా! సాయంత్రం వెళ్ళాలి. అని స్థిరమైన నిర్ణయానికి వచ్చి ఇంటికి తాళంవేసి బయలుదేరాడు.

పక్కఫ్లాట్ ముసలాడు చూస్తాడేమో, చప్పుడు కాకుండా వెళ్ళిపోవాలి. చూశాడంటే పలకరించకుండా ఒదలడు. ఏదో ఉచిత సలహాలివ్వాలని చూస్తాడు, అనుకుంటూ రెండడుగులు వేసేసరికి, అప్పుడే ప్రక్క ఇంటి తలుపు తెరుచుకుంది. ఏది జరగకూడదనుకున్నాడో అదే జరిగింది. బాబూ! శేఖర్! అంటూ బయటికొచ్చాడు ఆ పెద్దాయన. రిటైర్డ్ హెడ్‌మాస్టారు, కొడుకు దగ్గర ఉంటాడు. ఆయన పేరు పరంధామయ్య, అయినా అందరూ తాతగారు అనే పిలుస్తుంటారు.

ఛ! నేను ఎందుకింత బేలగా అయిపోతున్నాను. ఉద్యోగం పోయేసరికి, నాకు తెలివి, ఆలోచన అన్నీ పోయినట్టుగా ఉన్నాయి. ఉద్యోగం పోయినంత మాత్రాన నేను మరీ వీధిన పడాల్సిన స్థితిలో లేను కదా! ఎక్కువ కాలం ఇలా ఉంటే, ఆ పరిస్థితి వచ్చేస్తుందనే భయమే నన్నిలా వెంటాడుతోందేమో!

బాబూ! ఒకసారిలా వస్తావా? అంటున్న, పరంధామయ్యగారి పిలుపు వినిపించుకోకుండా గబగబా మెట్లుదిగటం మొదలుపెట్టాడు శేఖర్.

రెండడుగులు గబగబా బయటికి వచ్చి, పోనీలే! ఏదో పనిమీద వెడుతున్నట్లున్నాడు, సాయంత్రం మాట్లాడతాను అనుకుంటూ లోపలికెళ్ళిపోతున్న పరంధామయ్యగారి మాటలు విని, అమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని నెమ్మదిగా మిగిలిన మెట్లు దిగాడు.

కారు లత పట్టికెళ్ళిపోయింది కనుక, ఏనాడో ఒదిలేసి, మళ్ళీ ఈమధ్యనే తీసి దుమ్ముదులిపిన బైక్ తీసుకుని బయలుదేరాడు.

బైక్ స్టార్టుచేసి, సర్దుకుని కూర్చున్నాడో లేదో, సందు మొదట్లోంచి తన ఇంటివేపు వస్తున్న బిచ్చగాడు కనిపించాడు. వీడొకడు, ఆ ముసలాణ్ణి తప్పించుకుని వస్తే వీడు తయారయ్యాడు అని మనసులోనే విసుక్కొని వెనక్కి వెళ్ళిపోదామా అనుకున్నాడు. అమ్మో! వెనక్కెడితే గొయ్యి ముందుకెళ్తే నుయ్యి. ఆ ముసలాడికి దొరికానంటే తినేస్తాడు. ఐనా వెనక్కెళ్ళే ఓపిక కూడా లేదు. ఏమైతే అవనీ! అనుకుని మొండిగా బయలుదేరాడు. శేఖర్ మనసులోని అనుమానాన్ని గ్రహించినట్లుగా ఆ బిచ్చగాడు ముందుకు రాకుండా సందు మొదట్లోంచే వెనక్కి తిరిగిపోయాడు. ఛీ! మూడంతా పాడయింది. ఇప్పుడింక వెంటనే వెళ్ళలేను అనుకుంటూ ఏవో చిన్న చిన్న కావాల్సిన వస్తువులకోసం షాపులన్నీ తిరిగి తిరిగి ఒకటో రెండో కొన్నాడు. అమ్మయ్య ఇంక వెళ్తాను అనుకుని బయలుదేరి, కొంత దూరం రాగానే సిగ్నల్ పడింది.

మొన్నటివరకూ కార్లో తిరిగి, ఇప్పుడు మళ్ళీ బైక్‌లోకి వచ్చాడు అని ఎవరైనా ఎగతాళి చేస్తారేమోనని, తెలిసిన వాళ్ళెవరైనా ఉన్నారేమోనని హెల్మెట్ ఇంకొంచెం మొఖం మీదకి లాక్కుని చుట్టూ చూశాడు. మూడువైపులా ఫరవాలేదు. ఇక వెనకాల ఎవరైనా ఉన్నారేమో చూడాలి, అనుకుంటూ వెనక్కి తిరిగి గతుక్కుమన్నాడు పక్కింటి ముసలాయన ఇటే వస్తున్నాడు. ఇందాక సందు మొదట్లోంచే వెనక్కి తిరిగిపోయిన ముష్టివాడు, అంత ట్రాఫిక్ మధ్యలో నిలబడి, ఆగి ఉన్న కార్లవాళ్ళని యాచిస్తున్నాడు. దగ్గర నుంచి చూస్తే ఆ ముష్టివాడి మొఖం ఎక్కడో చూసినట్టుంది. ఆ! గుర్తొచ్చింది. ఔను! ఈ సిగ్నల్ దగ్గరే అప్పుడప్పుడు ఇలాగే కారాగినప్పుడు తను ఐదో పదో ఇచ్చేవాడు ఈ ముష్టివాడికే!

ఎండలో బైకుమీద కూచోటం కష్టంగా ఉంది. ఎ.సి. కార్లో అలవాటైన శేఖర్‌కి, తననిలా రోడ్డున పడేసినందుకు కారు తీసికెళ్ళినందుకు లత మీద కోపం కూడా వచ్చింది.

ఇంత సంపాదిస్తూ బైక్‌మీద వెళ్ళటం మీకేం ఖర్మ. పిల్లలు, నేను టాక్సీలోనో ఆటోలోనో వెళ్తాం. ఫరవాలేదు. మీరు కారు తీసికెళ్ళండి అనే లత, ఇప్పుడు తను బైటికి వెళ్ళాలని తెలిసికూడా కారు పట్టికెళ్ళిపోయింది.

ఈ రెండు నెలల్లో ఇంత మార్పా! ఆలోచిస్తూ ఉండిపోయిన శేఖర్, లైన్ క్లియర్ అవటం, గమనించనే లేదు. వెనకనున్న కారతను గట్టిగా హారన్ కొట్టేసరికి తుళ్ళిపడి కంగారులో రాంగ్ రూట్లో వెళ్ళిపోయి, ఆ కంగారులో అప్పుడే రోడ్డు దాటబోతున్న ఆ ముష్టివాడికి డాష్ ఇవ్వటం, అటునుంచి ఒస్తున్న కారు, కీచుమని శబ్దంచేస్తూ బైక్‌కి గుద్దుకుని సడన్ బ్రేక్‌తో ఆగటం అన్నీ ఒక్క నిముషంలో జరిగిపోయాయి.

చుట్టుపక్కల ఉన్న వాళ్ళంతా కిందపడిన బిచ్చగాడిని లేపారు. బైక్‌మీద కూచుని నిద్రపోతున్నావా? చావాలని రోడ్డుమీదకొచ్చావా? ఆ ముసలాడికి ఏమీ జరగలేదు కనక సరిపోయింది. కారు కూడా సడన్ బ్రేక్ వెయ్యటంవలన బతికావు లేకపోతే ఇవ్వాళ్టితో నీ కథ ముగిసేది! ఇలా అందరూ తలొక రకంగా ఎవరి నోటికొచ్చినట్లు వాళ్ళు అంటున్నారు.

ఆ బిచ్చగాడు మాత్రం ఆ బాబు తప్పేమీ లేదు బాబూ, నేనే కంగారుపడి ఆ బాబు బండికి అడ్డొచ్చాను. చిన్న దెబ్బేలే బాబూ, మాకీ దెబ్బలు లెక్కలోవి కావు అంటూ.



"నా కళ్ళు తెరిపించావు స్వామీ! లక్షలు సంపాదిస్తూ కన్న తల్లిని, మానవత్వాన్ని మర్చిపోయి, నిన్ను చూడటానికి కూడా అహంకారం అడ్డువచ్చి, అంధకారంలో కొట్టుకుపోతున్న నన్ను, రక్షించావు. నాకీ ప్రశాంతమైన జీవితం చాలు. ఈ ప్రశాంతతను కోల్పోయేంత సంపాదన ఆడంబరాలు నాకు వద్దు.

"నీకేమైనా దెబ్బ తగిలిందా బాబూ"అంటూ శేఖర్ దగ్గరకొచ్చి, కాళ్ళు చేతులు పట్టి చూశాడు.

"సడన్ బ్రేక్ వేశాను, కనక సరిపోయింది. లేకపోతే నీతోపాటు, ఆ ముసలాణ్ణి కూడా అనవసరంగా చంపేసేవాడివి కదయ్యా"అంటూ కార్లోంచి దిగిన పెద్దమనిషి శేఖర్‌ని తిడుతున్నాడు.

'నాకేమైనా ఫరవాలేదు బాబూ, నాలాంటి వాళ్ళు ఉన్నా, లేకపోయినా ఒకటే. ఈ బాబులాంటి ధర్మాత్ముడు బతికుంటే, నాలాంటివాళ్ళని వందమందిని ఆదుకుంటాడు. భగవంతుడు నా ఆయుష్షు కూడా ఆ బాబుకి పొయ్యాలి' అంటున్న ముష్టివాడిని చూస్తుంటే శేఖర్‌కి యాక్సిడెంట్ కన్నా పెద్ద షాక్ తగిలినట్టనిపించింది. ఇంతలో నెమ్మదిగా అక్కడికి చేరిన పరంధామయ్య 'అయ్యో! శేఖర్ నువ్వేనా! ఎవరో అనుకున్నానయ్యా' రోడ్డుమీద ఆలోచనలేమిటి చెప్పు అంటూ, చనువుగా ఏదీ ఆ చెయ్యి చూపించు దెబ్బేమైనా తగిలిందా అంటూ చెయ్యి పట్టుకు చూస్తున్న తాతగారిని చూసి, అప్పటివరకూ శేఖర్‌ని తిడుతున్న కార్లోని పెద్దమనిషి,

"అరె! మీరేనా మాష్టారూ! మీ ఇంటికే వస్తున్నాను. మీరు ఈమధ్యన రెండుమూడుసార్లు అడిగారు కదా! మీ పక్కింటివాళ్ళే. తెలుగువాళ్ళే ఉన్నారు. ఏదైనా మీ ఆఫీసులో అవకాశం ఉంటే చెప్పమని, అనుకోకుండా నిన్న, నా ఫ్రెండొకడు ఫోన్ చేశాడు. ఎక్స్‌పీరియన్స్ ఉన్న ఇంజనీరింగ్ వాళ్ళు కావాలని వెంటనే మీరు చెప్పిన మాట గుర్తొచ్చింది. ఫోన్ చేసే బదులు ఒకసారి మీ ఇంటికివస్తే మిమ్మల్ని కూడా చూసినట్టు ఉంటుందని బయలుదేరాను. మీరు ఇక్కడే కలిసారు. రండి కారెక్కండి" అన్నాడు.

"ఇతని గురించేనయ్యా నీకు చెప్పింది. చాలా మంచివాడు. ఏం చేస్తాడు అనుకోకుండా ఉద్యోగం పోయింది. పాపం రోజూ తెగ తిరుగుతున్నాడు. మీరందరూ నా బిడ్డల లాంటి వాళ్ళయ్యా! ఎవరు బాధపడినా నేను చూడలేను. ధైర్యం చెప్పు, నాలుగు మాటలు చెబుదామంటే, ఇతనికి మొహమాటమెక్కువ. గబగబా వెళ్ళిపోతాడు. నిన్ను కలుసుకోమని చెబుదామని రెండురోజుల నుంచి ప్రయత్నిస్తున్నాను అన్నారు.

ఉదయం ఆయన్ని తప్పించుకోవాలని, పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చిన, తన కుసంస్కారానికి, అహంకారానికి, తనమీద తనకే అసహ్యం వేసింది శేఖర్‌కి. భూమి బద్దలై తనిక్కడే కప్పబడిపోతే బాగుండనిపించింది.

అప్పుడప్పుడు పదో ఐదో ఇచ్చినందుకు, తన ఆయుర్దాయాన్ని కూడా కలుపుకుని బతకమని, కోరుకునే ఆ ముష్టివాడిని, బ్రతికినంతకాలం నలుగురికీ సాయపడుతూ బ్రతకాలని కోరుకునే పక్కింటి పరంధామయ్య తాతగారిని చూశాక వాళ్ళ ఔన్నత్యం ముందు తను ఎంత అల్పుడో అర్థమైంది శేఖర్‌కి.

సాయంత్రం ప్రశాంతమైన మనసుతో తాతగారితో కలిసి గుడికెళ్ళాడు. లోపల కాలుపెడుతుంటే తనిన్నాళ్ళూ, లత పిల్లలు గుడికి వెడితే క్యూలో నిలబడటం, రష్ ఇష్టం ఉండదంటూ గుడి బయటే కారు దిగకుండా కూచున్న రోజులు గుర్తొచ్చి గట్టిగా చెంపలు వాయించుకున్నాడు.

"నా కళ్ళు తెరిపించావు స్వామీ! లక్షలు సంపాదిస్తూ కన్న తల్లిని, మానవత్వాన్ని మర్చిపోయి, నిన్ను చూడటానికి కూడా అహంకారం అడ్డువచ్చి, అంధకారంలో కొట్టుకుపోతున్న నన్ను, రక్షించావు. నాకీ ప్రశాంతమైన జీవితం చాలు. ఈ ప్రశాంతతను కోల్పోయేంత సంపాదన ఆడంబరాలు నాకు వద్దు. నా జీవితాన్ని ఇలాగే నడిపించు తండ్రీ అని మనసారా నమస్కారం చేసుకున్నాడు.

"కారు అమ్మేశారు. పెద్ద ఇల్లు కావాలని కట్టించి, దానిని అద్దెకిచ్చి చిన్న ఇంట్లోకి మకాం మారుస్తానంటున్నారు. పిల్లల్ని టెక్నో స్కూల్ మాన్పించి మామూలు స్కూల్లో వేస్తానంటున్నారు. వాళ్ళు ఏ క్లాస్ చదువుతున్నారో కూడా పట్టించుకోని మీరు ఇకనుంచి వాళ్ళకి చదువు చెప్తానంటున్నారు. నాకు తెలిసిన దగ్గరనుంచీ విమానంలోనే తప్ప రైల్లో ప్రయాణం చెయ్యని మీరు రైల్లో తిరపతి వెళ్దాం అంటున్నారు. ఏమయింది మీకు? ఎందుకు చేస్తున్నారు ఇదంతా?

అయినా మనమిద్దరం మన పిల్లలు ఇద్దరు అంతేగా. నాలుగు పెద్దవాళ్ళ టిక్కెట్లు రెండు పిల్లల టిక్కెట్లు తెచ్చారెందుకు. రిజర్వేషన్ కూడా పరంధామయ్య. అప్పల నరసయ్య అనే రెండు పేర్లతో కూడా చేస్తున్నారు ఈ పంథామయ్య, అప్పల నరసయ్య ఎవరు? అంది లత చికాకుగా, శేఖర్ తిరుపతి కళ్యాణానికి, ప్రయాణానికి తెచ్చిన టిక్కెట్లు చూసి.

అన్ని ప్రశ్నలకు సమాధానంగా శేఖర్ మాత్రం నా శ్రేయోభిలాషులు అన్నాడు ప్రశంతంగా.

★

రచయిత చిరునామా:
**ఎమ్.శ్యామల,**
20-181, గొల్ల నారాయణపురం,
శ్రీనివాసనగర్, సింహాచలం రోడ్
విశాఖపట్నం- 28.